క్లుప్తంగా

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

● ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్ ఆర్డీఓకు మంగళవారం లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉండగానే పట్టణ శివారులో పేదలకు, జర్నలిస్టులకు కాలనీ ఏర్పాటు చేసేందుకు విలువైన స్థలాన్ని సేకరించినట్లు తెలిపారు. సదరు స్థలంలో ఒక్కో జర్నలిస్టుకు 200 గజాల చొప్పున స్థలం మంజూరు చేయాలని, అంతేకాకుండా ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన విధంగా వారికి ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరు చేయాలని ఉత్తమ్ ఆ లేఖలో అధికారులను కోరారు.

చలివేంద్రం ప్రారంభం



హుజూర్‌నగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చన

హుజూర్‌నగర్ : ప్రజల అవసరాలు తీర్చడంలో ముందుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ జె.నాగేశ్వరరావు, కౌన్సిలర్లు ఫణి రాంరెడ్డి, వి.నాగేశ్వరరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ చైర్లు అందజేత



స్టడీ చైర్లతో పాఠకులు, నిరుద్యోగులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని గ్రంథాలయానికి మున్సిపాలిటీ నిధులు రూ.35 వేలతో స్టడీ చైర్లు, ప్యాడ్లను మంగళవారం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రంథాలయ అధికారి శ్రీధర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిరుద్యోగులు కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు గజమాలతో సన్మానం



సన్మానిస్తున్న మాజీ కౌన్సిలర్లు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్ పర్సన్ దొంతగాని లక్ష్మమ్మ ఆమె కుమారుడు మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌ను వారి నివాసంలో మంగళవారం మాజీ కౌన్సిలర్లు శాలువ, గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌లు టి.రవి నాయక్, జె.శ్రీనివాస్, వై.పిచ్చయ్య, ఎం.కిరణ్, కె.పుల్ల య్య, పి.శ్రీను, ఎస్.శంభయ్య, కె.బ్రహ్మారెడ్డి, వి.కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న విద్యాసాగర్

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంలో నిర్మాణంలో ఉన్న శ్రీగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన ఆచార్య ఫౌండేషన్ అధినేత తంగెళ్లపల్లి విద్యాసాగర్ రూ.5 లక్షల విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నెమ్మోజు గురుబ్రహ్మాచారి మంగళవారం తెలిపారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ కోశాధికారి నెమ్మోజు నర్సింహచారి, విశ్వబ్రాహ్మణ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్.పెద్దకాంతయ్య, నాయకులు టి.మల్లాచారి తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



పంపిణీ చేస్తున్న డీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బాబురావు

హుజూర్‌నగర్ : పట్టణంలోని భవిత దివ్యాంగుల కేంద్రంలోని దివ్యాంగులకు మంగళవారం డీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేశారు. ఇందిరాల మహేందర్ జన్మదినం సందర్భంగా తల్లిదండ్రులు సురేఖ శ్రీనివాస్‌లు దివ్యాంగులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో క్యాంప్ స్కూల్ హెచ్ఎం యతిపతిరావు, ఐఈఆర్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్ !

రెండుపూటలా బడి నిర్వహిస్తున్న ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు

- నర్సరీ పిల్లలకు సైతం
- మండుటెండలో విద్యార్థులకు తిప్పలు
- పట్టించుకోని అధికారులు



కోదాడ : కోదాడలో కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ఎండలు మండిపోతుండడంతో ఈనెల 15 నుంచి విద్యార్థులకు ఒంటిపూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రభుత్వ పాఠశాలలన్నీ ఉదయం 8 గంటల నుంచి 12- 30 గంటల వరకు నిర్వహిస్తున్నాయి. కానీ పట్టణంలోని నూటికి 90 శాతం ప్రైవేటు పాఠశాలలు మాత్రం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నాయి. అయినా వాటిపై చర్యలు తీసుకునే నాథుడే కరువయ్యారు. రెండు పూటలు పాఠశాలలు పెడుతుండడంతో ఇరుకు గదుల్లో సరైన సౌకర్యాలు లేక ఉక్కపోతకు చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

నర్సరీ పిల్లలకు సైతం..

పట్టణంలో 10 ప్రైవేటు పాఠశాలలు నర్సరీ నుంచి ఐదవ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలు కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక 10వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్న 20కి పైగా పాఠశాలలు నిబంధనలకు వ్యతిరేకంగా ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నాయి. వీటిలో సగానికిపైగా పాఠశాలలు రేకులషెడ్లలో నడుస్తున్నాయి. దీంతో ఎండ వేడిమికి చిన్నారులు వడలిపోతున్నారని పలువురు అంటున్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆవేదన..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం తాము పాఠశాలలను బంద్ చేస్తున్నామని కానీ ప్రైవేటు పాఠశాలలు రెండు పూటల తరగతులు నిర్వహిస్తుండడంతో పలువురు తమను తప్పు బడుతున్నారని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అంటున్నారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి చదువు చెప్పేవారుగా.. తాము పిల్లలను గాలికి వదిలేస్తున్న మాదిరిగా తల్లిదండ్రులు చూస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు అన్ని పాఠశాలలకు ఒకే విధంగా ఉండాలని, ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించేవిధంగా చూడాలని లేనిపక్షంలో ప్రభుత్వ పాఠశాలలను కూడా రెండు పూటల బడులు నిర్వహించాలని అంటున్నారు.

చర్యలు తీసుకుంటాం

> పట్టణంలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా రెండు పూటల తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఆయా పాఠశాలలను ఇప్పటికే హెచ్చరించాం. మరోసారి తనిఖీ చేసి రెండు పూటల తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనలు అందరు పాటించాల్సిందే.
> – సలీం షరీఫ్, ఎంఈఓ, కోదాడ

సంక్షేమ పథకాలపై గ్రామాల్లో చర్చ జరపాలి



మునగాల : ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

● ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మునగాల : తెలంగాణలో అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో చర్చ జరపాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని తాడువాయి శివారులో గల శివాలయం ఆవరణలో నిర్వహించిన బీఆర్ఎస్ మండల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పాలకుల హయాంలో రాష్ట్రం వెనుకబడిందని, ఎనిమిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి లేదని, సరైన నీటి వసతి, విద్యుత్ లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ప్రజల కష్టాలను తెలుసుకొని రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అనేక సంక్షేమ పథకాలు చేపట్టి కష్టాలు తీర్చాడన్నారు. కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చూసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. ఆత్మీయ సమ్మేళనంలో కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తొగరు రమేష్, ఎంపీపీ ఎలక బిందు, జెడ్పీటీసీ సభ్యురాలు నల పాటి ప్రమీల, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సుంకర అజయ్‌కమార్, పీఏసీఎస్ చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, తొగరు సీతారాములు, వి.రావి ఎరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ఎలక వెంకటరెడ్డి, కాసర్లపూడి శ్రీనివాసరావు, ఉప్పుల యుగంధర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీల, గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు, పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో తెలంగాణ పల్లెలు



హుజూర్‌నగర్ : ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

● ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మెట్టు శ్రీనివాస్

హుజూర్‌నగర్ : తెలంగాణలో పల్లెలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, ఆత్మీయ సమ్మేళన జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక కౌండిన్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ మండల ఆత్మీయ సమ్మేళనంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. గత పాలకుల పాలనలో పల్లెలు అదోగతిలో ఉంటే నేడు రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని చెప్పారు. ఊరూరా సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని ప్రజలందరికి వివరించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితపై అక్రమ కేసులు పెడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోప్పుల సైదిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ముడెం గోపిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ కె.వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు కేఎల్ఎన్‌రెడ్డి, చావా వీరభద్రరావు, జి.వీరన్న, అబ్దుల్‌నబీ, ప్రజాప్రతినిధులు, మహిళలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును ప్రారంభించిన ఎమ్మెల్యే..

పట్టణంలోని 2వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే సైదిరెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన, వైస్ చైర్మన్ జె.నాగేశ్వరరావు, కౌన్సిలర్ జె.శంబయ్య, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి..

తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులు ఎమ్మెల్యే సైదిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అలాగే గ్రంథాలయంలో పాఠకులకు సౌకర్యాలు కల్పించాలని, భోజనం వసతి కల్పించాలని పలువురు విన్నవించారు.



నేరేడుచర్ల : రోడ్డు ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

మృతుల కుటుంబాలకు పరామర్శ

నేరేడుచర్ల : నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత గొట్టెటి రామయ్య కుమార్తె మధులత, గొట్టెటి నర్సయ్య మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మంగళవారం ముకుందాపురంలో వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. పెంచికల్‌దిన్న గ్రామంలో విలేకరి వెంకటేశ్వర్‌రావు తల్లి సక్కుబాయమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఈనెల 31వ తేదీన జరగనున్న మార్కెట్ కమిటీ ప్రమాణాస్వీకార మహోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు అరిబండి సురేష్‌బాబు, చల్లా శ్రీలతారెడ్డి, ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగళ్ల శ్రీధర్, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ గుర్రం మార్కెండేయ, పీఏసీఎస్ చైర్మన్ అనంత్ శ్రీను తదితరులున్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

పాలకవీడు : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అందించే దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని పీఏసీఎస్ చైర్మన్ యరడ్ల సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం పాలకవీడు సహకార సంఘం కార్యాలయంలో సంఘం డైరెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.13.50 కోట్ల టర్నోవర్‌తో సంఘం ముందంజలో ఉందన్నారు. ఇటీవల రూ.2.80 లక్షలతో అలింగాపురంలోని పీఏసీఎస్ సబ్ కార్యాలయానికి ప్రహరీ నిర్మించినట్లు తెలిపారు. పంట రుణాలు తీసుకున్న 1306 మంది రైతులు రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చిరువ్యాపారులు రుణాలు సకాలంలో తిరిగి చెల్లించాలన్నారు. ప్రస్తుతమున్న 50 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంను 200 మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి పెంచేందుకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు వెల్లడించారు. డైరెక్టర్లు వైస్ చైర్మన్ పగడాల మట్టేష్, బూషిపల్లి వెంకటరెడ్డి, పిచ్చమ్మ, శ్రీనివాస్, శంకర్‌నాయక్, మట్టారెడ్డి, శ్రీనివాసరెడ్డి రైతులు పాల్గొన్నారు.



పాలకవీడు : మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

రైతుల అభివృద్ధికి కృషి

కోదాడరూరల్ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతుల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు కాపుగల్లు పీఏసీఎస్ చైర్మన్ నంబూరి సూర్యం అన్నారు. మంగళవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన గోదాముల తీర్మాణం, హెచ్ఆర్ పాలసీ విధివిధానాలు, చైర్మన్‌ల గౌరవ వేతనంపై సమావేశంలో చర్చించారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్‌లు ముత్తవరపు వీరయ్య, నల్లూరి రమేష్, బాలెబోయిన వెంకటేశ్వర్లు, మార్తి లక్ష్మీనర్సయ్య, సులోచన ఉన్నారు.

పశుపోషణలో మెళకువలు పాటించాలి

మేళ్లచెరువు : పశుపోషణలో రైతులు మెళకువలు పాటించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మండలంలోని రేవూరు గ్రామంలో చింతలపాలెం మండలం దొండపాడు పరిధిలో గల జువారి సిమెంట్ పరిశ్రమ, జిల్లా పశు సంవర్ధక శాఖ, సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో ఆయన పాల్గొని మాట్లాడారు. పశుగ్రాసం, వ్యాక్సినేషన్ వంటివి అంశాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. ఈ శిబిరంలో 150 పశువులకు వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జువారి పరిశ్రమ హెచ్ఆర్ హెడ్ పద్మసింగ్ పాటిల్, కంపెనీ లైజన్ ఆఫీసర్ లుగేంద్ర పిళ్లై ఎంపీపీ పద్మ, మండల పశువైద్యాధికారిణి డాక్టర్ ఉషారాణి, సీడ్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ నాగబ్రహ్మాచారి, డాక్టర్ మధు, రమేష్, శేషగిరి, శేఖర్, వీరబాబు, శ్రీనాథ్, వెంకన్న, తుమ్మ శ్రీనివాసరావు, గిరి తదితరులు పాల్గొన్నారు.



మందులు అందిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు

ఆలయంలో అన్నదానం

కోదాడఅర్బన్ : పట్టణంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించి 38 వారాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో సుమారు ఆరు వందల మందికి అన్నదానం చేశారు. దాతలు అర్వపల్లి నాగేందర్ శ్రీదేవి, కుక్కడపు ప్రకాశం, గౌరి, మహేశ్వరరావు, ప్రసన్న, నాగమేల్లేశ్వరరావు, సుజాత, గాంధీ, ఆలయ అధ్యక్షుడు అంజయ్య, అన్నదాన నిర్వాహకులు హనుమంతరావు భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే ప్రభుత్వ లక్ష్యం

నడిగూడెం : ఆరోగ్యవంతమైన సమాజమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ యాతాకుల జ్యోతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అలాగే సిరిపురంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ యం.యర్రయ్య, ఏపీఎం రామలక్ష్మి, సర్పంచ్‌లు గడ్డం నాగలక్ష్మి, మొక్క లక్ష్మీవీణ, ఎంపీటీసీ శెట్టి జ్యోతి, ఉపసర్పంచ్ నసీమా తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో పోషకాలు పుష్కలం

హుజూర్‌నగర్ : చిరుధాన్యాలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమాదేవి, సోవమ్మ, అంగన్‌వాడీ, మెప్మా, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్

మఠంపల్లి : చిరుధాన్యాలలో సంపూర్ణ పోషకాలు ఉంటాయని ఎంపీపీ పార్వతీకొండానాయక్, సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాయాగౌడ్, ఎంపీడీఓ జానకి రాములు, ఎస్ఐ రవి, ఎంపీఓ ఆంజనేయులు, ఐసీడీఎస్ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలలు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో గల రైతు వేదికలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేశ్వరి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక పదార్థాలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు పోషకాలు కలిగిన వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉపేంద్ర, టీచర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మఠంపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి

పోషకాహారంపై అవగాహన

హుజూర్‌నగర్‌రూరల్ : చిరుధాన్యాలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి అన్నారు. మండలంలోని లింగగిరి సెక్టార్‌లో గల వేపలసింగారంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం చిరుధాన్యాలు, మిల్లెట్స్ పోషకాహారంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి పెండెం నాగమణి, వార్డుసభ్యులు అన్నెం కొండారెడ్డి, సాముల హరిలీల, వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఎంపీడీఓ జోగు శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ వాజీద్‌అలీ అన్నారు. మంగళవారం చింతలపాలెం గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఐసీడీఎస్, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోదాడరూరల్ : ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కూచిపూడిలో పోషణ్ పక్వాడపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసశర్మ, సర్పంచ్ సురేష్, రమణ, వీరబాబు, జీవిత, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ అర్చన



హుజూర్‌నగర్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జోగు శ్రీనివాసరెడ్డి



చిలుకూరు : బేతవోలులో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్, అధికారులు

'మితిమీరుతున్న అధికార పార్టీ ఆగడాలు'

మునగాల : మండలంలోని కలకోవలో అధికార బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆగడాలు రోజురోజుకూ మితిమీరుతున్నాయని, అరాచకాలు చేస్తూ గొడవలు సృష్టిస్తున్నారని అలాంటి వ్యక్తులపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సీపీఎం మండల కార్యదర్శి చందా చంద్రయ్య కోరారు. మంగళవారం మునగాలలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్య సొసైటీ ఎన్నికలో గెలుపొందిన సందర్భంగా విజయోత్సవ సభను తాము ప్రశాంతంగా జరుపుకున్నామని కానీ బీఆర్ఎస్ నాయకులు ఆత్మీయ సమ్మేళానికి ర్యాలీగా వెళ్తూ తమ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తల ఇళ్ల ముందు కావాలని బాణసంచా కాల్చుతూ, ఈలలు వేస్తూ గొడవకు దారితీసే ప్రయత్నం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం, దేశిరెడ్డి స్టాలిన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తికట్టించారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనము, రక్షాభందనం, రుత్విగ్వరనం, మధుపర్క పూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకుల పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాబాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగార్జున



నూతన కార్యవర్గంతో న్యాయవాదులు

కోదాడఅర్బన్ : కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవబత్తిని నాగార్జున మరోసారి ఎన్నికయ్యారు. మంగళవారం అధ్యక్షుడి పదవికి జరిగిన పోలింగ్‌లో నాగార్జున 50 ఓట్ల మెజార్టీతో యడ్లపల్లి వెంకటేశ్వర్లుపై గెలుపొందినట్లు ఎన్నికల అధికారి మంత్రిప్రగఢ రాజారాం తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా సాధు శరత్‌బాబు, ఉపాధ్యక్షుడిగా గాలి శ్రీనివాస్‌నాయుడు, సహాయ కార్యదర్శిగా తూములూరి సీతారామరాజు, కోశాధికారిగా షేక్ జానీపాషా, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కార్యదర్శిగా అరవపల్లి పవన్‌కుమార్, గ్రంథాలయ కార్యదర్శిగా కరీముల్లా, మహిళా కార్యదర్శిగా హేమలత, ఎగ్జిగ్యూటీవ్ సభ్యులుగా సుల్తాని నాగరాజు, దొడ్డ శ్రీధర్, సెగ్గం వెంకటాచలం ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ కోదాడ కోర్టు నూతన భవన నిర్మాణానికి, సీనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి కోర్టుల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. తనను గెలిపించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సీనియర్ న్యాయవాదులు ఎస్ఆర్‌కేమూర్తి, సుధాకర్‌రెడ్డి, సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, పాలేటి నాగేశ్వరరావు, ఈదుల కృష్ణయ్య, గట్ల నర్సింహారావు, వెంకటేశ్వర్లు, తదితరులు అభినందించారు. అధ్యక్ష, కార్యదర్శులను శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి సంబరాలు చేసుకున్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



నడిగూడెం : విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న సర్పంచ్

నడిగూడెం : మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కొల్లు రామతులసి మంగళవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. సర్పంచ్ మంచికంటి వెంకటరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు షేక్.ఇమామ్ సాహెబ్, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామినేని సతీష్, సైదానాయక్, ఉపాధ్యాయులు సునీతకుమారి, సత్యనారాయణరెడ్డి, అబ్బుతుల్లా, వెంకటేశ్వర్లు, బాబు, మండడి అశోక్‌రెడ్డి, సీఆర్పీ గోవర్దన్ పాల్గొన్నారు.

దిర్శించర్ల జెడ్పీహెచ్ఎస్‌లో..

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పొటిశెట్టి శివ జ్ఞాపకార్థం వారి సోదరుడు పొలిశెట్టి శంకర్ పరీక్ష సామగ్రిని మంగళవారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, పొలిశెట్టి లలిత, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, శ్రీదేవి, శ్రీనివాస్, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, యాదగిరి, కోటిరెడ్డి, వెంకటకృష్ణ తదితరులున్నారు.



నేరేడుచర్ల : దిర్శించర్ల జెడ్పీహెచ్ఎస్‌లో పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న హెచ్ఎం మధు, దాతలు



మఠంపల్లి : విద్యార్థులకు బెల్టులు గుర్తింపు కార్డులు అందజేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

బెల్టులు, గుర్తింపు కార్డులు పంపిణీ

మఠంపల్లి : మండలంలోని భీల్యానాయక్‌తండా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు అందజేసిన బెల్టులు, టై, గుర్తింపు కార్డులను మంగళవారం జెడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్, సర్పంచ్ బానోతు శాంతిలు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ధరావత్ శౌరినాయక్, గ్రామపెద్దలు కోటానాయక్, శంకర్‌నాయక్, రాములు, హెచ్ఎం ఆర్.వేణుగోపాల్, ఉపాధ్యాయులు రాజేష్, నర్మద, రమాదేవి, ఉపేందర్‌రెడ్డి, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.